

కార్తీక్‌కు నివాళులర్పించిన డిఆర్‌ఓ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉగ్రదాడిలో అమరుడైన కార్తీక్ దశదిన కర్మ బుధవారం మండలంలోని ఎగువరాగి మానుపెంట గ్రామం వారి స్వగృహంలో జరిగింది. డిఆర్‌ఓ మోహన్ కుమార్, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డిఆర్‌ఓ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడైన పంగల కార్తీక్ యాదవ్ ఆత్మ శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీర రాఘవులు పాల్గొన్నారు.



కిక్కే.. కిక్కు..!

- ఎంఆర్‌పి కంటే అధికం
- గ్రామాల్లో బెల్టు షాపులు





ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

"గత ప్రభుత్వంలో నాణ్యత లేని మద్యం తాగి అనేక మంది కిడ్నీ, లివర్ పాడై వ్యాధులతో మృతువాత పడ్డారు.. మేము అధికారంలో కొస్తే మద్యం ధరలు తగ్గిస్తాం.. నాణ్యమైన మద్యం సరఫరా చేస్తాం..' ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మందుబాబులకు ఇచ్చిన హామీ ఇది. ప్రభుత్వం మద్యం దుకాణాల స్థానంలో మధ్యవర్తులు వచ్చారు. లక్షలు ఖర్చు చేసి మద్యం దుకాణాలు దిక్కించుకున్న మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు విర్ధుంగా వ్యవహరిస్తూ బెల్టుషాపులు నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం అమ్మకాలు ఎంఆర్‌పి ప్రకారమే అమ్మాలనే నిబంధనలను తుంగలో తొక్కి గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపులకు మద్యం తాగి ఎంఆర్‌పీ కంటే రూ.4 నుంచి రూ.6 క్వాటర్ బాటిల్‌పై అదనంగా తీసుకుంటున్నారు. డిమాండ్‌ను బట్టి క్వాటర్ బాటిల్ ధర పెరుగుతోంది. మరో వైపు ఉదయం 10 గంటల నుండీ రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు చేపట్టాలని నిబంధన స్పష్టంగా ఉన్నా ఎక్కడా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

చిత్తూరు జిల్లాలో ఎక్సైజ్ శాఖ నేతృత్వంలో 106 మద్యం షాపులను లాటరీ పద్ధతి ద్వారా కేటాయించారు. అత్యధికంగా పాలసముద్రం మండలోని మద్యం దుకాణం కోసం పోటీపడ్డారు. 32 మంది ఈ మద్యం దుకాణం కోసం పోటీపడ్డారు. 10, 15 దరఖాస్తులు వేసేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఒకటి రెండు మద్యం దుకాణాలు దక్కించుకున్న వాళ్ళు ఎలాగైనా ఏడాది లోపు మద్యం దుకాణాన్ని దక్కించుకొనేందుకు ఖర్చు చేసిన డబ్బులను లీజు ముగిసేలోపు ఎలాంటి అడ్డదార్లు తొక్కైనా సొమ్ము చేసుకొనే ప్రయత్నంలో అనధికారికంగా పర్మిట్ రూంలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా మద్యంషాపు పక్కనే మద్యం తాగే ఏర్పాటు చేస్తూ మినీబార్లను తలపిస్తున్నాయి. ఇలా అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న వాటికి ఎక్సైజ్‌శాఖ అధికారులతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.

మామూళ్లు ఇలా..

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మద్యం దుకాణాలు అప్పగించిన తరువాత మద్యం దుకాణాలు కేటాయించే సమయంలోనే ఎక్సైజ్ అధికారులకు మద్యం షాపులు దక్కించుకున్న వారు ఒక్కో మద్యం దుకాణానికి లక్ష రూపాయలు చెల్లించిన్నట్లు సమాచారం. మద్యం దుకాణాలు దక్కించుకున్నవారితో ఎక్సైజ్ అధికారులు నెలవారీ మామూళ్లపై ఒప్పదం చేసుకున్నట్లు తెలుస్తోంది. మద్యం షాపు కోసం లక్షల్లో ఖర్చు చేయడం, ఎక్సైజ్ అధికారులకు మామూళ్లతో మద్యం విక్రయాలు అక్రమాలను పాల్పడాల్సి వస్తోందంటున్నారు మద్యం దుకాణదారులు. మద్యం అమ్మకాల కోసం గ్రామీణ ప్రాంతాల్లో బెల్టుషాపులు నిర్వహించాల్సి వస్తోందంటున్నారు. ఏది ఏమైనప్పటికీ కూటమి పార్టీలు ఎన్నికల ముందు నాణ్యమైన మద్యం, ధరలు తగ్గింపు మద్యం మత్తులు ఇచ్చిన మాటలుగానే తెలిపోతున్నాయి. మద్యం అమ్మకాలు పెరిగాయి. ధరలు ఏమాత్రం తగ్గలేదు. నాణ్యత అంతమాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టుషాపుల్లో అధిక ఎంఆర్‌పీలకు విక్రయాలు వీటిపై ఎక్సైజ్ అధికారులు మామూళ్లు ఇదేం కిక్కురా.. బాబు.. అంటూ మద్యం ప్రియులు జేబులు ఖాళీ చేసుకుంటు వారి భాషలో నానాభూతులు తిడుతున్నారు.

ఏపీకి కేంద్రం తీరని ద్రోహం

బడ్జెట్ నకళ్లు దగ్ధం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం తీరని అన్యాయం చేసిందంటూ చిత్తూరు పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట సిఐటియు, ఏఐటియుసి నాయకులు బుధవారం బడ్జెట్ ప్రతులను తగలబెట్టి నిరసన తెలిపారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు కేటాయించలేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్ మండిపడ్డారు. నాలుగు లేబర్ రద్దు, ఉపాధి హామీకి నిధుల కేటాయింపుల్లో తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటియుసి నాయకులు కె.రమాదేవి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేయడం దారుమణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.జ్యోతి, కుమార్, ఆరోగ్యదాసు, శివ, అర్జున్, కెవిపిఎస్ నాయకులు రాజశేఖర్, ఏఐటియుసి నాయకులు లతా పాల్గొన్నారు.



చిత్తూరులో..

విజయపురం (నగరి): కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన బడ్జెట్‌గా ఉందని, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌ల కిందకు తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేస్తోందంటూ ఏఐటియుసి సీనియర్ నాయకులు వేలన్ అధ్యక్షతన అంబేద్కర్ కూడలి వద్ద బడ్జెట్ ప్రతులను దగ్దం చేసి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆటో టాక్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పలమనేరు అంబేద్కర్ సర్కిల్లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిదర్ గుప్తా, బిల్డింగ్ కార్మికులు లక్ష్మయ్య, జానకి రాముడు, రవి సంజయ్ శర్మ, ఆటో యూనియన్ కార్యదర్శి రమేష్, రాజేష్, మురుగేష్ పాల్గొన్నారు.



నగరిలో..



పలమనేరులో..

10న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జాతీయ నులిపురుగల నిర్మూలనా కార్యక్రమానికి సంబందించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల కడుపులోని కొంకి పురుగు, నులి పురుగు, బద్దే పురుగు, గుండ్రని పురుగులను నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్యవృద్ధి పెంపొందించి తద్వారా ఉన్నత పౌరులుగా ఎదిగేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. పిల్లల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం రక్త హీనత వల్ల నీరసంగా ఉంటారని, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని దీని నుంచి పిల్లలని కాపాడేందుకు ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్నీ అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి, డిపిఎంఓ హనుమంత రావు, ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, అధికారులు పాల్గొన్నారు.


రైతుల సేవలో హార్టికల్చర్



పాత్రికేయ సమావేశంలో ప్రసంగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండల పరిధిలోని హార్టికల్చర్ కేంద్రం ద్వారా స్థానిక రైతులకు మెరుగైన విత్తన మొక్కలను అందిస్తున్నట్టు హార్టికల్చర్ శాఖ చిత్తూరు జిల్లా అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. కుప్పం మండల పరిధిలోని హార్టికల్చర్ కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ నుండి వచ్చిన హార్టికల్చర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మదేవ్ మాట్లాడుతూ 2016లో ఇజ్రాయిల్ దేశం వారు కుప్పం మండల పరిధిలో హార్టికల్చర్ కేంద్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. అయితే 2018 నుండి ఈ కేంద్రం ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో ఏకైక హార్టికల్చర్ కేంద్రంగా ఉన్న కుప్పం ప్రాంతంలో జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇప్పటికే కుప్పం కేంద్రంగా మూడు శిక్షణ కార్యక్రమాలు జరిగినట్టు తెలిపారు. మూడవ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని, ఈ కార్యక్రమానికి దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన హార్టికల్చర్, వ్యవసాయ శాఖ ప్రతినిధులు విచ్చేసినట్టు తెలిపారు. వీరందరికీ కూరగాయల మొక్కలను అంటుకట్టు విధానంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. అదేవిధంగా కుప్పం ప్రాంత రైతులకే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల రైతులకు సైతం కుప్పం హార్టికల్చర్ కేంద్రం ద్వారా సేవలు అందించినట్టు తెలిపారు. ముఖ్యంగా గత సంవత్సరం ఈ కేంద్రం ద్వారా దాదాపు కోటి మొక్కలను అంటుకట్టి రైతులకు అందజేయడం జరిగిందన్నారు. హార్టికల్చర్ ఏడి కోటేశ్వరరావు, కుప్పం హార్టికల్చర్ అధికారి డింపు ప్రియా, శాంతిపురం అధికారి వింధ్య పాల్గొన్నారు.

టిడ్కో ఛైర్మన్‌ను సన్మానించిన గురజాల చెన్నకేశవ నాయుడు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ చిత్తూరు పర్యటనలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలతో సత్కరించారు.

పకడ్బందీగా ఎన్‌సిడి స్క్రీనింగ్: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో జరుగుతున్న ఎన్‌సిడి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు సిఎంసి స్టార్ ఎన్‌సిడిఐ సిఎంఆర్ వారి సాంకేతిక సహకారంతో మరింత సమర్ధవంతంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ అద్యక్షతన ఎన్‌సిడి (అసంక్రమిత వ్యాది) స్క్రీనింగ్ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌సిడి స్క్రీనింగ్‌లో భాగంగా 1,07,038 ఇళ్లలో 2,75,467, 18ఏళ్లు నిండిన వారిని సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా హైపర్ టెన్షన్ 39762, డయాబెటిస్ 49054, ఓరల్ క్యాన్సర్ 79, బ్రెస్ట్ క్యాన్సర్ 81, సర్వైకల్ క్యాన్సర్ 68 మందికి ఉన్నట్లు నిర్ధారించి వారికి చికిత్స అందించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ స్క్రీనింగ్ ప్రక్రియను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక సహకారం నిమిత్తం సిఎంసి ఐసిఎంఆర్ ప్రాజెక్టు సహకరిస్తున్నారని తెలిపారు. సిఎంసి ఐసిఎంఆర్ ప్రాజెక్టు వారు చేపట్టిన సర్వేలో గుర్తించిన లోటుపాట్లను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి, జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ కుమార్, డిపిఎంఓ హనుమంత రావు, ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, డాక్టర్ దొరై తైలాల్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ స్టోర్ ఎన్‌సిడి ప్రాజెక్ట్ బృందం పాల్గొన్నారు.

సిపిఎం పోరాటంతో కదిలిన అధికారులు

- యానాదులకు ఇళ్ల స్థలాలు, గురుకులంకు స్థలపరిశీలన



స్థలపరిశీలన చేస్తున్న డిఆర్‌ఓతో సిపిఎం నాయకులు, యానాదులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సిపిఎం పోరాటంతో జిల్లా అధికార యంత్రాంగం కదిలిందని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు అన్నారు. బంగారుపాళ్యం మండలం మొగిలి యానాదులకు ఇళ్ళ స్థలాలు, గురుకుల పాఠశాల తదితరు మౌలిక సదుపాయాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేసిన ఫలితంగా బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, మొగిలి ఊరగుట్ట స్థలాలు పరిశీలించారు. ఈ పర్యటనలో పాల్గొన్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఊరగుట్ట స్థలాన్ని యానాదులు గొర్రెలు, మేకలు, పశువులు మేపుకుంటూ తమ అనుభవంలో ఉందని తెలిపారు. అయితే ఈ స్థలాలపై కొంతమంది కన్నుపడి అగ్రకులస్తులు భూకబ్జాకు పాల్పడ్డారని, దీనిపై యానాదులను ఐక్యం చేసి సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టగా కలెక్టర్ స్పందించి గతంలో డిప్యూటీ కలెక్టర్ భవాని ఆధ్వర్యంలో సర్వే చేయించగా 59 ఎకరాల ప్రభుత్వ భూమి వుందని తేల్చినట్లు తెలిపారు. ఆ స్థలంలో 12 మంది అగ్రకులాల వారు ఆక్రమించుకొని మామిడి చెట్లు పెట్టారని రెవెన్యూ అధికారులు గతంలో దొంగ పట్టాలు ఇచ్చారని, శ్మశానాన్ని కూడా ఆక్రమించడంతో ఆందోళన చేయగా రెవెన్యూ అధికారులు స్పందించి 67సెంట్లు కేటాయించారని గుర్తుచేశారు. మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా డీఆర్‌ఓను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారని, కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం డిఆర్‌ఓ ఊరగుట్టను సందర్శించి పరిశీలించారని తెలిపారు. తహశీల్దార్ ఊరగుట్ట ప్రాంతంలో గురుకుల పాఠశాలకు 5 ఎకరాలు, ఇళ్ల స్థలాల కొంతమంది అర్హులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు ఇతర సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి సదుపాయాలు కల్పించి ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ స్పందించి పరిశీలించడం అభినందనీయమన్నారు. యానాదుల సంఘం కార్యదర్శి నిర్మల, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శంకరన్, వీఆర్వో భవిత, మంజునాథ్, యానాదులు పాల్గొన్నారు.

ఏడాది లోగా లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

- టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఛైర్మన్ అజయ్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో టిడ్కో గృహాలు అన్నింటిని పూర్తి స్థాయిలో సిద్ధం చేసి ఈ ఏడాదిలో నిజమైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ చెప్పారు. బుధవారం చిత్తూరు నగర పాలక పరిధిలోని పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను అజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ టిడ్కో గృహాలను అన్ని మౌలిక వసతులతో పూర్తిచేసి వీలైనంత త్వరగా లబ్ధిదారులకు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మున్సిపల్ మంత్రి నారాయణ ఆదేశించారని, ఇందులో భాగంగా రాష్ట్రంలోని టిడ్కో గృహసముదాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. చిత్తూరులోని గృహ సముదాయాల్లో 2,800 గృహాలకు 2,400 వరకు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గృహాలతో పాటు వీధి దీపాలు, వీధులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. రుణాల కోసం బ్యాంకుల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉందని చాలామంది లబ్ధిదారులు వాపోతున్నారని ఈ విషయంలోనూ తగిన చర్యలు తీసుకుంటామని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులకు తగిన న్యాయం చేస్తామన్నారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్, టిడ్కో ఈఈ దేవిక, డీఈ వెంకట ముని, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వారి మంగళ విద్యావాణి మాసపత్రిక 33వ సంచికను చిత్తూరు కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమకుమార్ ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులే రచయితలుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విడుదల చేస్తున్న ఏకైక మాస పత్రిక మంగళ విద్యా వాణిని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి మాసపత్రికను నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ మాసపత్రిక నిర్వహణకు తన వంతు సహాయం అందిస్తానని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి తమ పాఠశాలలోని విద్యార్థులు హేమ, లహరి, పునీతులచే నిర్వహించే గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ విద్యార్థుల ప్రతిభను తెలుసుకుని అభినందించారు. గణిత అవధాని, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్.అరుణ శివప్రసాద్, ఉపాధ్యాయులు పిల్లారప్ప, భారతి, సంపంగి తదితరులు పాల్గొన్నారు

కుప్పం పురప్రజల సేవకు పేటీఎం ఫౌండేషన్



కడా పిడితో ఒప్పందం కుదుర్చుకుంటున్న పేటీఎం సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పురం ప్రజల సేవకు పేటీఎం ఫౌండేషన్ ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని కడా పీడి వికాస్ మరమత్ తెలిపారు. కడా అభ్యర్ధన మేరకు కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి రెండు ఆంబులెన్సులను సమకూర్చుడానికి పేటీఎం ఫౌండేషన్ అంగీకరించినట్టు తెలిపారు. ఈ విషయమై బుధవారం కడా ఆధ్వర్యంలో పేటీఎం సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం అతిత్వరలో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ సిస్టం కలిగి, అత్యవసర పరిస్థితులలో ప్రాణాపాయాన్ని తప్పించే సదుపాయం కలిగిన రెండు ఆంబులెన్సులు కుప్పం ప్రజలకు అందుబాటులో రానున్నట్టు తెలిపారు. 66 లక్షల రూపాయలు వెచ్చించి, ఒక్కొక్కటి 33 లక్షల రూపాయల విలువ చేసే ఆంబులెన్సులను ప్రభుత్వ ఆసుపత్రికి అందివ్వడానికి ముందుకు వచ్చిన పేటీఎం సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు అభినందించారు.

రహదారి నియమాలను పాటించండి..

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : రహదారి నియమాలను పాటించండి.. ప్రమాదాలను నివారించండి.. అంటూ నినదిస్తూ ద్రావిడ విశ్వవిద్యాలయ విద్యార్థులు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డనేటర్ ఆర్. యశోద ఆధ్వర్యంలో రహదారి నియమాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య దొరస్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు రహదారి నియమాలను తెలియజేస్తూ, వాహనాలను నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్సు డాక్టర్ ఆవినేని కిషోర్, డాక్టర్ జి.శైలమ్మ, డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ వి.కళావతి పాల్గొన్నారు.



బస్సు దిగాల్సిందే..

- రోజూ ఇదే పరిస్థితి..
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ప్రజలు



బస్సు దిగి నడుచుకుంటూ వెళుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం నుంచి వెదురుకుప్పం మండలం మీదుగా పెనుమూరు వరకు వెళ్లే బస్సులు కార్వేటినగరం కనం వద్దకు రాగానే గుట్ట ఎక్కలేమంటూ మొరాయిస్తాయి.. దీంతో ప్రయాణికులు కిందకు దిగితేనే బస్సు పైకి ఎక్కుతుంది.. రోజు ఇదే పరిస్థితి అంటూ ప్రజలు, విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రోజూ ఈ గుట్ట ఎక్కటాంటే బస్సులో నుంచి ప్రయాణికులు కిందకు దిగి బస్సు వెనుక నడుచుకుంటే వేళాల్సిందే.. లేదంటే బస్సు అక్కడే మొరాయిస్తూ ఉంటుంది.. గమ్యస్థానాలకు సమయానికి చేరుకునే పరిస్థితి ఉండదు.. రోజూ ఇదే తంతు అని ప్రయాణికులు, విద్యార్థులు విసుగు చెందుతున్నారు.. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మంచి కండీషన్‌లో ఉన్న బస్సులను ఈ రూట్‌లో నడపాలని వారు కోరుతున్నారు.

బ్రాహ్మణపల్లిలో పారిశుధ్య లోపం

రోడ్డుపైనే చెత్తాచెదారం



ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని ఉత్తర బ్రాహ్మణపల్లిలో పారిశుధ్య లోపించిందని, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయిందని, వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతునానరు. కాణిపాక వరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంకు వెళ్లే భక్తులు, కర్ణాటక సరిహద్దుల నుంచి బంగారుపాళ్యం, అరగొండ వైపుగా తవణంపల్లి ఉత్తర బ్రాహ్మణపల్లి మీదుగా వెళుత్తుంటారని, అలాగే కాలినడక వచ్చే భక్తులు సైతం ఈ మార్గాల్లోనే వెళ్తారని తెలిపారు. అటువంటి ప్రాంతాలు ఇలా అపరిశుభ్రం ఉండటం దారుణమన్నారు. మురుగు పేరుకుపోవడం వలన గ్రామాల్లో అనారోగ్య భారిన పడుతున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని చెత్తను తరలించడంతోపాటు కాలువల్లోని వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- కార్వేటినగరం: మైనారిటీ కార్పొరేషన్ల కింద అందించే సబ్సిడీ రుణాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవొ చంద్రమౌళి అన్నారు. బుధవారం ఎంపీడీవొ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీవొ మాట్లాడుతూ మైనారిటీల (ముస్లిం, సిక్కు, బుద్ధిస్టు, జైన్) కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన వారు తమ కార్పొరేషన్ల సంబంధించిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రుణం కోసం దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు సంవత్సర ఆదాయం రూ.లక్ష 50వేలకు మించకూడదన్నారు. వయస్సు 21 నుంచి 55 లోపు ఉండాలని పేర్కొన్నారు.

పట్రపల్లెలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఆవులపల్లి పంచాయతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మణికుమార్ ఆధ్వర్యంలో మురుగునీటి కాలువల చెత్తాచెదారాన్ని తీసివేయడం, గ్రామంలో పిచ్చి మొక్కలు తొలగించినట్లు తెలిపారు. శుభ్రపరచిన మురుగునీటి కాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించామని కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



ప్రజాశక్తి- కార్వేటినగరం: గర్భవతులు, బాలింతలకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం ఎంతో అవసరమని కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద అన్నారు. బుధవారం మండల పరిధిలోని పద్మసరస్సు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై బాలింతలకు, గర్భవతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ రక్తహీనత రహిత సమాజ నిర్మాణానికి అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే తోటకూర, మునగ వంటి ఆకులను ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనతను దూరం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాల్లో అందించి పోషకాహారాలను తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

తీరిన తాగునీటి సమస్య

ప్రజాశక్తి- గంగవరం : మండలంలోని గుండిగల్లు పంచాయతీ బొమ్మనపల్లి గ్రామంలో గత కొంత కాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుమార్లు సమస్యను సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్నర పాపాన పోలేదని తెలిపారు. దీంతో పత్రికల ద్వారా సమస్యను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే వెంటనే అధికారులతో మాట్లాడి తాగునీటి బోరును మంజూరు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఐఓసిఎల్‌లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

డిప్యూటీ కలెక్టర్ అనుపమ
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫైర్ మాక్‌డ్రిల్





ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైర్ మాక్‌డ్రిల్



ప్రజాశక్తి- యాదమరి: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఉండాలని డిప్యూటీ కలెక్టర్ అనుపమ తెలిపారు. యాదమరి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో అనుకోని విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్- నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) వారి ఆధ్వర్యంలో యాదమరి మండలం ఐఓసీఎల్‌లో జరిగే మాక్ డ్రిల్‌ను బుధవారం నిర్వహించారు. ఈ ఆర్‌డిఏంపి లెవల్ 3 మాక్ డిజాస్టర్ ఫైర్ డ్రిల్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ చిత్తూరు టెర్మినల్, సమీపంలోని పెరుమల్లపల్లె గ్రామంలో నిర్వహించారు. ఈఆర్‌డిఏంపి లెవల్ 3 ఫైర్‌డ్రిల్‌లో సమీప గ్రామాన్ని ఖాళీ చేయించడంతో పాటు, రక్షణ చర్యలు చేపట్టారు. చిత్తూరు జిల్లాలో ప్రమాదకరమైన పెట్రోలియం ఉత్పత్తులను నిల్వ చేసే టెర్మినల్ భద్రతను మెరుగుపరిచేందుకు, అగ్నిమాపక సామర్థ్యాలను ప్రదర్శించేందుకు ఐఓసిఎల్ తన కట్టుబాటును నెరవేర్చే భాగంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించింది. జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ రెడ్డి, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్‌ఎఫ్), స్థానిక అగ్నిమాపక దళం, పోలీస్, అంబులెన్స్, బాంబ్ స్క్వాడ్ (డిప్యూటీ సూపరెంట్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో) ఇతర రాష్ట్ర అధికారులు, ఐఓసిఎల్ చిత్తూరు టెర్మినల్ డీజీఎమ్ అమితాబ్ సర్దార్, సీనియర్ మేనేజర్ అరుణ్‌ప్రసాద్ నేతృత్వంలోని బృందం పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జెడి ప్రభాకర్, తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఎస్సై ఈశ్వర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విజేతగా మాధవరం టీం



నగదు బహుమతి అందుకుంటున్న మాధవరం టీం

ప్రజాశక్తి- విజయపురం: క్రికెట్ విజేతగా మాధవరం టీం నిలిచింది. వారం రోజుల పాటు మండలంలోని మాధవరంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో 30 టీములు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన మాధవరం టీంకు పాండ్యన్ రూ.10 వేలు నగదు బహుమతి అందించారు. రన్నర్గా నిలిచిన మంగళం టీంకు రూ.5 వేలు నగదును వేణు అందించారు. కార్యక్రమంలో పలువురు క్రికెట్ టోర్నమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతినెలా పిల్లల పెరుగుదల లెక్కిస్తాం..



ప్రజాశక్తి- విజయపురం (నగరి): ప్రతి నెలా పిల్లల పెరుగుదలను పరిశీలించి లెక్కించడం జరుగుతుదని సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. బుధవారం మున్సిపల్, విజయపురం మండలం కళియంబాకం పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బాల్య సంరక్షణ, విద్య దినోత్సవం (ఈసీసీఈ డే) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 5వ తేదీన అంగన్‌వాడీ సెంటర్లలో బాల్య సంరక్షణ, విద్య దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆ నెలలో పిల్లల పెరుగుదలను పరిశీలించడం జరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా పిల్లల బరువు లెక్కించి సంబంధించిన సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు దేవి, సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఎస్‌కేలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అవగాహన

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: కార్వేటినగరం ప్రాజెక్టు సిడిపిఓ పద్మ సునంద ఆధ్వర్యంలో మండలంలోని ఆరిమాకులపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఎమ్మెస్‌కే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఆధార్ అప్డేషన్స్, గ్రోత్ మానిటరింగ్, వాటర్ హార్వెస్టింగ్, పోషణ వాటికపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కలించారు. ప్రతిరోజు ఈసీసీఈ డే జరుపుకోవాలని, తల్లిదండ్రులకు వారి పిల్లల బరువులు గురించి వివరించాలని తెలిపారు.

ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం



ప్రజాశక్తి- గంగవరం : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిఎల్ఎస్ ఫారంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కార్ప్స్ వారి సౌజన్యంతో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం -2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నేలనీటి సంరక్షణ, వినియోగం, సేంద్రీయ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. రైతుల పొలాల దగ్గరికి విద్యార్థులను తీసుకుని వెళ్లి రైతులకు, విద్యార్థులకు నేల, నీటి వినియోగం, సంరక్షణ గురించి తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చెంగప్ప, ఏపీ ఎన్జీసి క్లస్టర్ కోఆర్డినేటర్ ఎన్.ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో తనిఖీలు

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలోని బీసీ హాస్టల్‌ను తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ తురక అమర్నాథ్ బుధవారం సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులకు సౌకర్యాలు అరకొరగా ఉన్నాయని, బాత్ రూములు, విద్యార్థులకు భోజనం వసతి సక్రమంగా నిర్వహించలేదని తెలియజేశారు.

ప్రత్యేక దృష్టి పెట్టండి: జయప్రకాష్ నాయుడు

ప్రజాశక్తి- కార్వేటినగరం: దివ్యాంగ విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త జయప్రకాష్ నాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల విద్యార్థులపై వివక్ష చూపకుండా ప్రత్యేక దృష్టి సారించి వారి ప్రతిభను గుర్తించాలని సూచించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులతో వారి విద్యా వివరాలకు అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లల శారీరక, మానసిక పరిస్థితుల వివరాలను సహిత ఉపాధ్యాయురాలు సింధూజాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవిత కేంద్రం, రికార్డులను పరిశీలించారు. అదే విధంగా మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సహిత ఉపాధ్యాయరాలు రేఖ, సీఆర్పీ గణేష్ పలువురు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జయప్రకాష్ నాయుడు

గుండెపోటుపై అశ్రద్ధ వద్దు: డాక్టర్ మురళి

ప్రజాశక్తి- వీకోట: గుండెపోటు పట్ల ప్రజలు అశ్రద్ధ వహించ రాదని సిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మురళి తెలిపారు. వీ కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గుండెపోటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బాగంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళీ మాట్లాడుతూ మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా వయస్సుతో సంబంధం లేకుండా హార్ట్ఎటాక్ సంభవిస్తుందన్నారు. అకస్మాత్తుగా గుండెపోటు వచ్చినప్పుడు తొలి గంటలోపు అత్యవసర ఇంజక్షన్ ఇస్తే రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. అయితే ఇది ఖర్చుతో కూడుకున్నదని ఇంజక్షన్ అందుబాటులో లేకపోవడం, ఆర్థిక సమస్యల కారణంగా సరైన సమయంలో వైద్యం అందక గుండెపోటుతో మరణించే వారి సంఖ్య అధికమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి గుండెనొప్పి రోగులకు మేలు చేకూరేలా చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా వీ కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటుకు గురైన వారికి అందుబాటలో రూ.42వేలు ఖరీదు గల ఇంజక్షన్ పూర్తిగా ఉచితంగా గుండెకు సంబంధించిన రోగులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. గుండెకు సంబంధిత రోగులు పరీక్షలు చేయించుకుని సదరు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్యులు ప్రవీణ్ కుమార్, సంపత్ కిరణ్, కల్పణ, అశ్విని, ప్రమీల ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



ఒప్పంద కార్మికులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి- పుంగనూరు: పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులు తప్పనిసరిగా యూనిఫామ్, బ్లౌజులు ధరించాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాష అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో 84 మంది ఒప్పంద కార్మికులకు యూనిఫామ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వృత్తిపరమైన ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం పంపిణీ చేసే యూనిఫామ్, బ్లౌజులు వాడాలన్నారు. ఈ సందర్భంగా ఒప్పంద పారిశుద్ధ కార్మికులకు ప్రభుత్వం తరపున 84 మందికి యూనిఫారం, చీరలు, బ్లౌజ్ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ ముని వెంకటప్ప, సానిటరీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న చైర్మన్, కమిషనర్

'బీసీలపై జగన్ విషం కక్కుతున్నారు'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో 3850 వైన్ షాపుల్లో, 10 శాతం షాపుల్ని రిజర్వేషన్ ద్వారా కల్లుగీత కార్మికులకి కేటాయిస్తే ఓర్చుకోలేని జగన్ మోహన్ రెడ్డి తన వైసిపి నాయకులు చేత హైకోర్టులో స్టేలు కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేయటం జగన్మోహన్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని టిడిపి రాష్ట్ర నాయకులు సప్తగిరి ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలు ఆర్థికంగా ఎదిగితే చూసి ఓర్చుకోలేకనే ఈ విధంగా హైకోర్టులో, న్యాయస్థానాల్లో తన కార్యకర్తలు, నాయకులు చేత పిటిషన్లు వేయిస్తూ అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. గతంలో అమరావతి రాజధాని పైన విషం కక్కిన జగన్మోహన్ రెడ్డి నేడు బీసీల ఎదుగుదల పైన విషం కక్కుతున్నాడని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన చంద్రబాబు నాయుడు న్యాయస్థానంలో దీటుగా పిటిషన్లు ఎదుర్కొని, స్టే రానీయకుండా అడ్డుకుని. జగన్మోహన్ రెడ్డినీ పాతాళానికి తొక్కినప్పటికీ ఇంకా వారిలో మార్పు రాలేదని అన్నారు. సమావేశంలో మేషక్, మోహన్ రాజ్, షబ్బీర్ బాష, బాబు నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర నాయకులు సప్తగిరి ప్రసాద్

చిరుత పిల్లల కోసం గాలింపు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చిరుత పిల్లలు కూడా ఉన్నట్లు అనేక ఫోన్ కాల్స్ అటవీ అధికారులకు చేస్తున్నారని, దీనిపై అటవీ శాఖ ఉప ఎఫ్ఆర్ఓలు నాగ భూషణం, సుదర్శన్, అటవీ బయాలజిస్ట్ సౌజన్యలు వర్సిటీ ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎన్ఎస్ఎస్, మీడియా కోఆర్డినేటర్ డాక్టరు పాకనాటి హరికృష్ణల దృష్టికి తీసుకువచ్చి వర్సిటీలో బుధవారం ఫారెస్ట్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇందు కోసం ఫారెస్ట్ అధికారులు వంద మందితో నాలుగు లేయర్లగా మొదటి లేయర్ గా 20 మంది ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది, రెండవ లేయర్‌గా వర్సిటీ సెక్యూరిటీ, మూడవ, నాలుగవ లేయర్‌గా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వర్సిటీ విద్యార్థులు ఉంటూ బుధవారం ఉదయం 10.30 గంటలకు పెరంబులేషన్ (గమ్యం లేని గమ్యం కోసం వెతుకులాట) ప్రక్రియ తో వర్సిటీని జల్లెడ పడుతూ ముందుకు సాగారు. మొదట ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ - ఈ విభాగం దగ్గర నుంచి ఫార్మాస్యూటికల్ కాలేజ్, కేంద్రీయ లైబ్రరీ తదితర ప్రాంతాలలో మూడు గ్రూపులుగా విడిపోయి ప్రారంభించారు. ఇది సాయంకాలం నాలుగున్నర వరకు కొనసాగింది.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లి మృతి



ప్రజాశక్తి-విజయపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మండలంలోని తెల్లగుంట వద్ద జరిగింది. పోలీసు కథనం మేరకు వివరాలు... నింద్ర మండలం అగరంపేట దళితవాడకు చెందిన మునస్వామి (51), అతని చెల్లెలు మంజుల (44) అనారోగ్యం కారణంగా ద్విచక్ర వాహనంలో విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్లో చికిత్స చేసుకొని ఆమె బంధువుల ఇంటికి కేవీపురం బయలు దేరారు. మార్గమధ్యమం తెల్లగుంట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయి ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ బలరాం తెలిపారు. మృతునికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె, మృతురాలికి పిల్లలు లేరు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



ప్రజాశక్తి- విజయపురం (నగరి): మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పంకు చెందిన ఎస్.ఎస్. కరుణాకరన్ (24) మంగళవారం వేకువజామున పళ్లిపట్టు రోడ్డు రాజేశ్వరి థియేటర్ సమీపం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాల పాలయ్యాడు. అతన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం బంధువులు తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యచికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. మృతదేహానికి నగరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

గడ్డివామి దగ్ధం

రూ.75వేలు ఆస్తినష్టం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : పలమనేరు నియోజకవర్గంలోని నక్కపల్లి గ్రామంలో జే.ఈశ్వరయ్య రైతుకు 10 ఆవులు, ఐదు దూడలు ఉన్నాయి. వాటికోసం వరిగడ్డి ఆరు లోడ్లు నిల్వ ఉంచినట్లు రైతు తెలిపారు. ఆ గడ్డిని గుర్తు తెలియని దుండగులు బుధవారం సాయంత్రం నిప్పంటించారని రైతు వెల్లడించారు. వెంటనే గుర్తించి పలమనేరు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయగా వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నా మంటలను అదుపు చేయలేకపోయారు. అనంతరం జెసిబి సాయంతో గడ్డిని పక్కకు తొలగిస్తూ మంటలను అదుపు చేశారని, అప్పటికే 95శాతం గడ్డివామీ దగ్ధమైనట్లు తెలిపారు. దీంతో తమకు రూ.75వేలు ఆస్తి నష్టం వాట్లిందని, గడ్డి లేక పశువులు ఇబ్బంది పడాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి రమేష్ బాబు, పలమనేరు ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఎస్ఎఫ్ఓ మనోహరన్, ఎల్ఎఫ్ రెడ్డప్పరెడ్డి, పిఓపి పాండియన్ ఎఫ్ఎం భూషణ్ ఎఫ్ఎం హెూనస్ పాల్గొన్నారు

టిడిపి సీనియర్ కార్యకర్త మృతి

ప్రజాశక్తి - రొంపిచర్ల: మండలంలోని గానుగచింత గ్రామం పేటగడ్డకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త వేముల సహదేవయ్య (60) అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కృష్ణమ నాయుడు, ఆనంద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, వెంకటరమణ నాయుడు, రెడ్డప్ప రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ముద్దు కృష్ణ పరామర్శించి సంతాపం తెలియజేశారు.

న్యాయం చేయాలంటూ నిరసన



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం గత మూడు రోజుల క్రితం తన భర్త మండలంలోని ఎస్ఆర్ పురం గ్రామపంచాయతీ పాతపాళ్యం గ్రామం వద్ద ప్రమాదంలో మరణించాడని ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతుడి భార్య టి.గిరిజ కోరారు. గమ మూడు రోజులుగా తమ భర్త మృతదేహాన్ని ఇంటి ఎదుట ఉంచి తనకు, తని ఇద్దరు కూతుళ్లు, కొడుక్కి న్యాయం చేయాలని కోరుతున్నారు. భర్త మృతితో తమ కుటుంబా వీధన పడిందని, మృతికి గల కారణాలను పోలీసులు దర్యాప్తు చేయాలని ఆమె వేడుకుంటోంది..

వైసిపి కీలక నిర్ణయం

ఎనిమిది మంది కార్పొరేటర్లపై బహిష్కరణ వేటు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి ఆర్‌సి మునికృష్ణకు ఓటింగ్‌లో మద్దతు పలికిన వైసిపి కార్పొరేటర్లపై వహిష్కరణ వేటు వేస్తున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతికి చెందిన ఎనిమిది మంది కార్పొరేటర్లను పార్టీ నుంచి తొలగించినట్లు ప్రకటించారు. 10వ వార్డు కార్పొరేటర్ దొడ్డారెడ్డి గుప్త సాయి ప్రతాప్ రెడ్డి, 11వ వార్డు కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళిక, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, 32వ వార్డు కార్పొరేటర్ సి. శైలజ, వైసిపి నాయకులు తిరుత్తణి వేణుగోపాల్, 33వ వార్డ్ కార్పొరేటర్ దూది కుమారి, వైసిపి నాయకులు దూది శివప్రసాద్, 43వ వార్డు కార్పొరేటర్ ఆవుల రాధ, ఆవుల మురళీ యాదవ్‌లపై పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. ఈ చర్యతో తిరుపతి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయం నేపథ్యంలో, బహిష్కృత కార్పొరేటర్లు తమ భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పార్టీ క్రమశిక్షణ పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైసిపి వర్గాలు పేర్కొన్నాయి.